www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 8 నవంబర్ 2025



విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

తాడేపల్లిగూడెం: పాము, తేలు కాటు వల్ల మనిషికి ఎక్కే విషం కన్నా, డ్రగ్స్ ఉపయోగించడం వల్ల మనిషికి ఎక్కే విషయం వంద రెట్లు ఎక్కువని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా అన్నారు. శుక్రవారం వెంకటరామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కేసు నమోదైతే జీవిత ఖైదు పడే అవకాశం ఉందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపరాదని తెలిపారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితాదేవి మాట్లాడుతూ పోష్, పోక్సో యాక్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అసోసియేట్ డీన్ ఎవిడి.దొర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శిరిగినీడి విజయకృష్ణ, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, అనంతరం వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతరం గీతం ఆలపించారు.

'పంచాయతీ'ల్లో మ్యాపింగ్ మాయ..!

- 500కుపైగా ఆస్తులకు ఒకటే ఫోన్ నెంబర్ మ్యాపింగ్
- కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులు సీరియస్
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇద్దరు కార్యదర్శులు సస్పెండ్
- కుక్కునూరు మండలం అమరవరం, నరసాపురం మండలంలో వేములదీవి వెస్ట్ కార్యదర్శులపై వేటు
- మరికొంతమందికి షోకాజ్ నోటీసులు జారీ
- పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా అంటూ జనాల్లో చర్చ
- ఆడిట్‌లో నిర్లక్ష్యం, ఆర్థిక సంఘం నిధుల ఖర్చుల్లోనూ అవకతవకలే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీల పరిధిలోని ఆస్తులకు ఫోన్ నెంబర్ మ్యాపింగ్‌లో కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరి అత్యంత ఘోరంగా తయారైంది. కార్యాలయాల్లో కూర్చుని ఇష్టమొచ్చిన ఫోన్ నెంబర్లను ప్రజల ఆస్తులకు మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీని వెనుక పెద్దఎత్తున అవినీతి పర్వం నడుస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ పరిధిలోని ఆస్తులకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఆస్తులకు సంబంధిత యాజమానుల ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేస్తారు. గ్రామస్తులు పన్నులు చెల్లించిన వెంటనే సంబంధిత యజమాని ఫోన్‌కు మెసేజ్ వెళ్తుంది. ఒకవేళ పన్ను చెల్లించకపోయినా హెచ్చరిక మెసేజీ వెళ్లే విధంగా ఈ విధానం తెచ్చారు. అత్యంత కీలకమైన ఫోన్ నెంబర్ల మ్యాపింగ్‌లో పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసిన పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో కుక్కునూరు మండలంలోని అమరవరం, పెదవేగి మండలంలోని కూచింపూడి, ముసునూరు మండలంలోని ముసునూరు, టి.నరసాపురం మండలంలోని టి.నరసాపురం, చింతలపూడి మండలంలోని ప్రగడవరం పంచాయతీల్లో 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు తేలింది. చాలా పంచాయతీల్లో వందల సంఖ్యలో ఆస్తులకు ఒకే నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో గ్రామంలోని 50 శాతం ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించి కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. మిగిలిన నాలుగు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం మండలంలోని వేములదీవి వెస్ట్, పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు, కాళ్ల మండలం పెదఅమిరం పంచాయతీల్లో వందల ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్టు తేల్చారు. దీంతో వేములదీవి వెస్ట్ పంచాయతీ కార్యదర్శిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రాష్ట్రస్థాయి పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాకు ఒక పంచాయతీ కార్యదర్శిని మాత్రమే ప్రస్తుతానికి సస్పెండ్ చేసినట్టు తెలుస్తోంది. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు, హెచ్చరికలు చేసిన పరిస్థితి ఉంది. అత్యధిక పంచాయతీల్లో మ్యాపింగ్‌లో భారీ అవకతవకలు జరిగినట్టు చెబుతున్నారు. ప్రజల నుంచి వచ్చే పన్ను సొమ్మును స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా చెల్లింపులు చేయాలి. అలాకాకుండా కొంతమంది కార్యదర్శులు సొమ్ము తీసుకుని, సొంత ఖర్చులకు వాడుకుని తర్వాత తాపీగా ఆ సొమ్ము చెల్లించడం, లేదా దుర్వినియోగం చేయడం జరుగుతుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే యజమానులకు మెసేజ్‌లు వెళ్లకుండా ఉండేందుకు తప్పుడు ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేసినట్టు చర్చ సాగుతోంది. ఇప్పటికైనా అవినీతికి అడ్డుకట్ట వేస్తారా, లేదో చూడాలి.

ఆడిట్, ఆర్థిక సంఘ నిధుల ఖర్చుల్లోనూ అవకతవకలే

పంచాయతీ వ్యవస్థ ప్రాభవం గాడి తప్పిందని విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై పంచాయతీ సొమ్మును ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు సైతం ఉన్నతాధికారులకు అందుతున్నాయి. పలు పంచాయతీల అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి సైతం ఇటీవల ఉంది. ప్రతియేటా పంచాయతీలకు సంబంధించి, నిధులు, ఖర్చులపై ఆడిట్ చేయించాల్సి ఉంటుంది. చాలామంది కార్యదర్శులు సకాలంలో ఆడిట్ చేయించని పరిస్థితి కన్పిస్తోంది. ఏలూరు జిల్లాలో పలు పంచాయతీలకు సంబంధించిన ఆడిట్‌లో లక్షల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.200 కోట్ల సొమ్ముపై అభ్యంతరాలను ఆడిట్ అధికారులు లేవనెత్తినట్లు సమాచారం. ఆర్థిక సంఘం నిధులు, సంబంధిత ఖర్చులకు సంబంధించి ఇ-గ్రామస్వరాజ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇ-గ్రామస్వరాజ్‌లో ఇష్టానుసారం వెండర్ అకౌంట్లు తెరిచి సొమ్ము మళ్లిస్తున్న పరిస్థితి ఎక్కువగా ఉంది. తమ బంధువులు, కుటుంబసభ్యుల పేర్లతో వెండర్ అకౌంట్లు ఓపెన్ చేసి సొమ్ము మళ్లిస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో అవినీతిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప బయటకు రావడం లేదు. ఎంపిడిఒలు, డిఎల్‌పిఒలు పంచాయతీ కార్యదర్శులకు కొమ్ముకాయడం కారణంగానే అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

స్వాతంత్ర స్ఫూర్తికి మూలం వందేమాతరం

కలెక్టర్ నాగరాణి



వందేమాతరం గీతాలాపన చేస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్‌పి, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం

మన స్వాతంత్ర స్ఫూర్తికి మూలం వందేమాతరం, మన ఐక్యతకు ప్రతీక వందేమాతరం అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 'వందే మాతరం' రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం భీమవరం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వందేమాతరం అనేది దేశభక్తి నినాదం మాత్రమే కాదని, అది మన మనసుల్లో దేశమంటే ఏమిటో గుర్తు చేసే శక్తి అని అన్నారు. వందేమాతరం అనేది కేవలం ఒక గీతం కాదని, అది భారతీయుల మనసుల్లో దేశభక్తిని మేల్కొలిపిన ఆత్మీయ నినాదంగా అభివర్ణించారు. బకిం చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్రోద్యమంలో కోట్లాది భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని, త్యాగస్ఫూర్తిని నింపిందన్నారు. పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన గీతం వందేమాతరం అన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ జాతీయ సమైక్యత భావంతో దేశ ప్రజల్లో శాంతి పురిగొల్పేలా బకిం చంద్ర ఛటర్జీ వందేమాతరం గీతాన్ని రచించారని, వందేమాతరం, జనగణమన గీతాలు భారతీయతను చాటుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.గీతాబాయి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణకుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, తహశీల్దార్ రావి రాంబాబు, టిడిపి నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, ఎపిఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్ బండి రమేష్, స్థానిక నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, యారంశెట్టి శివకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, గనిరెడ్డి త్రినాథ్, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి, పిఎస్ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో నూరు శాతం కేన్సర్ నిరోధం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ముందస్తు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా నూరుశాతం నిరోధించొచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహనా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి ప్రకాశం చౌక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులు కలెక్టర్ చదలవాడ నాగరాణి, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధి నుండి కోలుకునే అవకాశం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ వ్యాధి పట్ల స్త్రీ, పురుషులు తేడా లేకుండా ప్రతిఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు ముందస్తుగా నిర్వహించుకోవాలన్నారు. జీవన శైలిలో మార్పులు రావడంతో బిపి, షుగర్‌తోపాటు కేన్సర్ కేసులు గణనీయంగా నమోదవుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం ఎక్కువ సంఖ్యలో కొత్త కేన్సర్ కేసులు వెలుగుచూస్తున్నాయన్నారు. వీటిలో చాలా కేసులు ఆలస్యంగా గుర్తించడంతో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవాల్సి రావడం, తిరిగి నయం చేయలేని స్థితిలో ఉండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో పేషెంట్‌తోపాటు కుటుంబాలు అధిక ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయన్నారు. దీనికి ఒకే ఒక పరిష్కారం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం, బిపి, సుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమని భావనలో ఉన్నారో, అదేవిధంగా కేన్సర్‌పైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.గీతాబాయి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణ కుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, తహశీల్దార్ రావి రాంబాబు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం

విప్లవ దినోత్సవ సభలో సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం అని, దీని సాధనకు విప్లవ స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో విప్లవ దినోత్సవ సభ సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ 1917లో సంభవించిన మహత్తర రష్యన్ విప్లవం సామాజిక వ్యవస్థకు ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోచుకోని, దోపిడీ లేని సోషలిస్టు వ్యవస్థకు జన్మనిచ్చిందన్నారు. పాత సామాజిక విప్లవాలు మానవాళిని ఒక దోపిడీ వ్యవస్థ నుండి మరో దోపిడీ వ్యవస్థకు నడిపిస్తే, మహోత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం దోపిడీని పూర్తిగా నిర్మూలించే కార్మికవర్గ రాజ్యానికి అంకురార్పణ చేసిందన్నారు. మోడీ పాలన అసమానతలను పెంచేవిధంగా సాగుతుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రజలకు పాలకులు అందించడం లేదని, కార్మిక చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూలంగా దోచుకునే మార్గాలను అమలు చేస్తున్నారని అన్నారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో రానున్న కాలంలో అన్ని రంగాల్లో అసమానతలను తొలగించే విధంగా పెద్దఎత్తున ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.కృష్ణ, బొక్కా సత్యనారాయణ, కె.క్రాంతిప్రసాద్, వడుగు వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, నాగమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ విప్లవ 108వ దినోత్సవం శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవజాతి మనుగడకు సరైన మార్గం సోషలిజమే అన్నారు. మార్క్స్, ఎంగెల్స్ రచించిన మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని సరైన పద్ధతిలో సక్రమంగా ఉపయోగించడం ద్వారా రష్యాలో లెనిన్, స్టాలిన్, కార్మిక వర్గ నాయకత్వంలో 1919లో విప్లవం జయప్రదమైందన్నారు. ప్రస్తుతం శ్రమ పట్ల గౌరవం చూపకపోగా, చులకనగా చూసే ధోరణి ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుండి భూముల్ని, ఆదివాసీల నుండి అడవిని



తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

లాక్కుంటున్నారని అన్నారు. ఏ పనీ చేయకుండా ఇతరుల కష్టాన్ని కొల్లగొట్టి కోట్లు కూడబెట్టేవాడే గొప్పవాడు, వీరుడు, శూరుడు అంటున్నారని విమర్శించారు. సీనియర్ నేత పి.గోవింద్ మాట్లాడుతూ సోవియట్ రష్యాలో జరిగిన అద్భుతం గొప్ప ఉత్తేజాన్నిచ్చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న అనేక సంక్షోభాలకు చక్కనైన పరిష్కారం సోషలిజమే అని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ న్యూయార్క్‌లో డెమొక్రటిక్ సోషలిస్ట్ అభ్యర్థి విజయం సోషలిస్టులకు మంచి ఊపునిచ్చిందన్నారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగులు 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, కరక వెంకట్రావు, చిటికిన రాము, యాసరపు ఎర్రినాయుడు, నరమాల కృష్ణ, దేశంశెట్టి సతీష్, వడిసెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తణుకు: దేశంలో మెజార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రష్యా విప్లవ పోరాట స్ఫూర్తితో పోరాటం సాగించాలని దారి దీపం సంపాదకులు డివివిఎస్.వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక అమరవీరుల భవనంలో రష్యా విప్లవ వార్షికోత్సవ సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్రబాబు, డి.సీతారామయ్య మాట్లాడుతూ రష్యా విప్లవం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎన్నో హక్కుల కోసం పోరాటాలు సాగించారన్నారు. లెనిన్ నాయకత్వంలో మొట్టమొదటి కార్మిక రాజ్యం రష్యాలో ఏర్పడిందన్నారు. కులం, మతం, శ్రమ దోపిడీ లేని రాజ్యం, సమసమాజం కోసం నేటికీ కమ్యూనిస్టులు పని చేస్తున్నారన్నారు. రష్యా మనదేశానికి ఎంతో సహాయం చేసిందన్నారు. నేటికీ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి, గూడు వంటివి మోడీ ప్రభుత్వం అందించడం లేదని విమర్శించారు. 8 గంటల పనిని నేడు 13 గంటలకు మార్చి, కార్మికుల హక్కులు హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యాంగ వేదిక నాయకులు సంకు మనోరమ, ఐద్వా నేత కె.నాగరత్నం, గార రంగారావు, నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు : శ్రామిక వర్గ పోరాటాలతోనే పీడిత ప్రజలకు విముక్తి అని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బొక్కా సత్యనారాయణ అన్నారు. అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా సిపిఎం జెండా ఆవిష్కరణలు జరిగాయి. స్థానిక 14వ వార్డు జవహర్ పేటలో సిపిఎం పతాకాన్ని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొక్కా సత్యనారాయణ, సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ సమాజంలోని సకల రుగ్మతలకు పెట్టుబడిదారీ వ్యవస్థే కారణమన్నారు. సోషలిస్ట్ విప్లవం ద్వారానే కార్మిక వర్గాలకు రాజ్యాధికారం వస్తుందన్నారు. పెట్టుబడిదారీ దేశాల్లో వామపక్ష శక్తులు బలాన్ని పెంచుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ సంస్థలను రక్షించుకునేందుకు కార్మికవర్గం సంఘటితంగా పోరాడాలని ఇరువురు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె.వలీ, పెంకి అప్పారావు, డి.లక్ష్మి, డి.రవితేజ, బివి.వర్మ, బి.కళ్యాణి, ఎస్.ఉదయకుమారి, బంకా.రాజు, జివి.లావణ్య, సందక సూరిబాబు, అచ్చాయమ్మ, వెంకటలక్ష్మి, ముప్వా శ్రీను పాల్గొన్నారు.



తణుకు: మాట్లాడుతున్న డివివిఎస్ వర్మ

ప్రకృతి సాగు అంగడి ప్రారంభం

- సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఎంతో మేలు
- డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు



ప్రకృతి సాగు అంగడిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, ఎంఎల్‌ఎ, కలెక్టర్,

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనానికి సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఎంతో మేలు చేస్తాయని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో విస్సాకోడేరు వంతెన సమీపాన ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల అంగడిని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు సంయుక్తంగా ప్రారంభించారు. అంగడి సంప్రదాయబద్ధంగా వెదురు బొంగులతో, రెల్లి గడ్డి పైకప్పుతో ఎంతో ఆకర్షణీయంగా డిఆర్‌డిఎ అధికారి పర్యవేక్షణలో తయారు చేయించారు. ఇది చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్య అతిథులు అంగడి అంతా పరిశీలించి సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. రైతులతో, డ్వాక్రా మహిళలతో మాట్లాడి ఎక్కడ పండిస్తున్నారు, ఎక్కడైనా మార్కెట్లో అమ్ముతున్నారా, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్ ఎలా ఉందని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాల అంగడి సాంప్రదాయబద్ధంగా మంచి వాతావరణంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎస్‌హెచ్‌జిల ద్వారా సేంద్రియ ఉత్పత్తుల అంగడిని నిర్వహించడం ఒక శుభ పరిణామమన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సేంద్రియ ఆహారం భుజించడం చాలా ముఖ్యమన్నారు. సాగులో క్రిమిసంహారక మందులు వినియోగించిన ఉత్పత్తులను తినడం ద్వారా ప్రజల ఆరోగ్యంపై చాలా ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, లైవ్లీ హుడ్స్ డిపిఎం కుసుమకుమారి, ఆర్‌వైఎస్ఎస్ డిపిఎం నూకరాజు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, పాలకోడేరు ఎపిఎం భారతి, మండల సమాఖ్య ప్రెసిడెంట్ లక్ష్మీ కుమారి, పాలకోడేరు తహశీల్దార్, ఎంపిడిఒ, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యాంధ్రప్రదేశ్‌గా మారిస్తే చూస్తూ ఊరుకోం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి



భీమవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న గీత కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి హెచ్చరించారు. మద్యం ఆదాయం కోసం, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం, ప్రభుత్వ పెద్దల ప్రయోజనాల కోసం ఘన చరిత్ర కలిగిన దివ్య ఔషధం వంటి తాటికల్లు అమ్మకాలను దెబ్బతీస్తే పోరాటాల ద్వారా గీతవృత్తిని కాపాడుకుంటామన్నారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద శుక్రవారం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం భీమవరం ఎక్సైజ్ ఎస్ఐ సునీల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడారు. కల్తీ మద్యానికి గీత వృత్తిని బలి చేయొద్దన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా గీత వృత్తిని ఆధునికీకరించాలన్నారు. ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఆదరణ పథకానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించాలని, కల్లుగీత కార్మిక కుటుంబాలకు ఉపాధి పెంచాలని అన్నారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ మద్యం కంపెనీలను గీత వృత్తిలోకి పరోక్షంగా ప్రవేశపెట్టి వృత్తిని సంక్షోభంలోకి నెట్టడం దుర్మార్గమన్నారు. కల్తీ మద్యం, అక్రమ మద్యం, బెల్టుషాపులతో గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారించడం గీత కార్మికుల బతుకులను రోడ్డున పడేయడమేనని అన్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ములకలపల్లి, ఇబ్రహీంపట్నం కల్తీ మద్యం తయారీ పరిశ్రమపై సిబిఐ ద్వారా విచారణ జరిపితే తెర వెనుక ఉన్న వారు బయటకు వస్తారని అన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొక్కా చంటి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం ఆదరణ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు నివారించేందుకు తెలంగాణలో ఇచ్చినట్లుగా సేఫ్టీ మోకులు ఇవ్వాలన్నారు. కల్లు తెచ్చుకునేందుకు ద్విచక్ర మోటార్ సైకిళ్లు ఇవ్వాలన్నారు. గీత వృత్తి చేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో తుంగా సాయిబాబు, చింతపల్లి చిన వీరాస్వామి, దొంగ సత్యనారాయణ, కౌరు వెంకటేశ్వరరావు, అంగరి రంగారావు, వీరవల్లి శ్రీనివాస్, ఇళ్ల చంద్రశేఖర్, కడలి పాండురంగారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: గీత వృత్తి రక్షణకు సమగ్ర చట్టం చేయాలని ఎపి కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గీత కార్మికుల వృత్తి రక్షణ బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దొరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గీత వృత్తికి రక్షణ లేకుండా పోయిందన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గీత కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రద్దు చేశారన్నారు. తాడి, ఈత చెట్లపై నుండి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన, వికలాంగులైన



తాడేపల్లిగూడెం : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న గీత కార్మికులు

గీత కార్మికులకు ఒక రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాడిచెట్లకు గతంలో మార్కింగ్ విధానం అమలులో ఉండేదని, చెట్టుపై గీత కార్మికులకు హక్కు ఉండేదని, దాన్ని తొలగించారన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం గీత వృత్తికి పూర్తి రక్షణ ఇస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అదేవిధంగా మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 75 వేల బెల్ట్‌షాపుల ద్వారా చీప్‌లిక్కర్ విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఫలితంగా కల్లు అమ్మకాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లును శీతల పానీయంగా గుర్తించాలని, తెలంగాణ రాష్ట్రంలో వలె ప్రతి జిల్లాలోనూ నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయాలని, రద్దు చేసిన ఎక్స్‌గ్రేషియాను అమలు చేయాలని, గీత కార్మిక వృత్తి రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో గీత కార్మికులు పెద్దఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి దాసరి సూరిబాబు, నేతలు పెచ్చెట్టి నాగమల్లేశ్వరరావు, బొల్లా విష్ణుమూర్తి, రాజులపాటి సాంబశివరావు, అయిన సుబ్బారావు, పెచ్చెట్టి కనకారావు, శ్రీనివాసరావు, కుక్కల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సెకండ్ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద 10న ధర్నా విజయవంతం చేయాలి

ఎపి కాంట్రాక్ట్ సెకండ్ ఎఎన్‌ఎంల యూనియన్ పిలుపు



సమస్యలపై చర్చిస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పని చేస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఎపి కాంట్రాక్ట్ సెకండ్ ఎఎన్‌ఎంల యూనియన్ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. సెకండ్ ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో పి.లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన యూనియన్ జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం ఎఎన్‌ఎంల ఖాళీల్లో తాత్కాలిక, డిప్యూటేషన్ పేరుతో సుదూర ప్రాంతాల నుంచి వేరే ప్రాంతాలకు నియమించి ఇప్పటికీ వెనక్కి తీసుకోకపోవడాన్ని ఖండించారు. చాలీచాలని వేతనాలతో నియామకం జరిగిన మండలాల నుండి వేరే ప్రాంతానికి తాత్కాలిక బదిలీ చేసి విపరీతమైన పని ఒత్తిడి, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఎవరి ప్రాంతాలకు వాళ్లను తిరిగి బదిలీ చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 180 రోజుల మెటర్నిటీ లీవ్‌ను తమకు అమలు చేయాలని, యూనిఫామ్, సెలవులు డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. 10న కలెక్టరేట్లకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని, డిసెంబర్ 8, 9 తేదీల్లో విజయవాడలో రిలే నిరాహార దీక్ష నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సెకండ్ ఎఎన్‌ఎంల ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు తెలిపారు. సమావేశంలో ఎఎన్‌ఎంల నాయకులు బి.నైటింగేల్, ఎం.నాగరత్నం, కె.పద్మావతి, ఎం.విజయలక్ష్మి, వైఎస్.ప్రియదర్శిని, శ్రీకన్య పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ
వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి గురుప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పొలమూరులో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలను అనుసరించి 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ ఆచంట నియోజకవర్గ పరిధిలోని పొలమూరులో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. వైసిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కలిదిండి దినేష్ రాజు, వడ్లమూడి ప్రదీప్, కుసుమే సురేష్, పెచ్చెట్టి నరసింహామూర్తి, కోలుకులూరి సతీష్ వర్మ పాల్గొన్నారు.

ఆచంట : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోడేరులో శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కోడేరు గ్రామ అధ్యక్షుడు మామిడిశెట్టి బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడం వల్ల వైద్య, విద్య పేద విద్యార్థులకు దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు కోట ప్రసాద్, మేడిది రెడ్డియ్య, సరెళ్ల మోహన్‌రావు, మేడిది కుమారి పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం

నరసాపురం:నరసాపురంలో పెనుప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం పాతస్టేట్ బ్యాంకు వీధిలో మున్సిపల్ ట్రాక్టర్ తిరగబడింది. వ్యాపారాలు అధికంగా ఉండే వీధి కావడంతో ఉదయాన్నే ఈ వీధుల్లో చెత్త తొలగిస్తుంటారు. చెత్తను తొలగిస్తూ జంగుసాహెబ్ వీధిలో నుండి రఫీ కట్ పీసెస్ వీధిలోకి టర్న్ చేసే సమయంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ప్రమాద సమయంలో షాపులు తీసి ఉండకపోవడం, అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు మిషన్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాడేపల్లిగూడెం:మహిళ ఆరోగ్యంపైనే కుటుంబ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని మెప్మా ఛైర్‌పర్సన్ గుండుమోగుల పద్మప్రియ అన్నారు. సఖీ సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల మధ్య మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం మహిళలపై ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మెప్మా మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు కేన్సర్, బీపీ, షుగర్ వంటి 16 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 800 పైబడి మహిళలకు పరీక్షలు చేశారు. మెప్మా సిఒ శ్రావణి, జనసేన నాయకుడు సురేష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

భీమవరం టౌన్:భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రజల నుంచి శుక్రవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ వీరవాసరం, భీమవరం మండలాలు, భీమవరం పట్టణంలోని ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో పరిష్కరించడానికి ప్రతి శుక్రవారమూ ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షుడు ఏపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వైద్య చికిత్సలు చేయించుకున్న వారు, వైద్య చికిత్స చేయించుకొని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం వీరవాసరం గ్రామానికి చెందిన ఒకరికి కేన్సర్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2 లక్షల 30 వేల రూపాయల చెక్కును అందజేశారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము, మండల అధ్యక్ష కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, వీరవాసరం మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.

నరసాపురంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు

నరసాపురం:పట్టణంలోని 7వ వార్డులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఇంటి పక్కన ఉన్న పుంతలో ముసలమ్మ అమ్మవారి అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొవ్వలి ఫౌండేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ నిమ్మకాయల గోపాలరావు నీలిమ దంపతులు, కొండా శ్రీధర్ జయలక్ష్మీ దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, సంకు భాస్కర్ నాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోటిపల్లి రాంబాబు, బుజ్జి, చినిమిల్లి త్రిమూర్తులు,జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి ఆలయ ఛైర్‌పర్సన్‌గా సావిత్రి

నరసాపురం:నరసాపురంలోని శ్రీ మదన గోపాలస్వామి దేవస్థానం ఛైర్‌పర్సన్‌గా వలవల సావిత్రిని నియమించినట్లు ఇఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు తెలిపారు. ఆమెతోపాటు ఎం.దుర్గానాగసాయి అనూష, కె.శ్రీనివాసు, కె.ఉమాసుందరి, ఎస్.లెనిన్‌బాబు, టి.సురేష్‌కుమార్, పి.సత్యనారాయణ, ఎస్.నాగమణి, పి.రాజు, పివిఎల్‌ఎన్.ఆచార్యులు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ నెల 8న శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. కొత్త కమిటీని పలువురు అభినందించారు.

పేదల పాలిట వరం సిఎం రిలీఫ్ ఫండ్

తాడేపల్లిగూడెం:పేదల పాలిట ఆసన్న హస్తం సిఎం రిలీఫ్ ఫండ్ అని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్షా 25 వేల చెక్కును ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన ఇద్దరుకు లబ్ధిదారులకు అందజేశారు. మూడో వార్డుకు చెందిన సింధూరీకి రూ.85000, 25వ వార్డుకు చెందిన ఎస్.శ్రీనివాస్ రావుకు రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదిత్య విద్యార్థిని

పాలకొల్లు : ఏలూరు జిల్లా పెదవేగిలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా బాలికల విభాగంలో నిర్వహించిన 200 మీటర్స్ (అండర్ 17) పరుగు పందెంలో ఆదిత్య టాలెంట్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని కాలా విజయ గీతిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన గీతికను, శిక్షణ ఇచ్చిన సిబ్బందిని ఆయన అభినందించారు.

వెంకటేశ్వర స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం


భీమవరం టౌన్:దేవాలయాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఛైర్మన్‌గా మంతెన రామ్ కుమార్ రాజు, సభ్యులుగా వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, వి.శ్యామలవతి, కె.దుర్గాప్రసాద్, ఎం.వెంకటలక్ష్మి, ఐ.నాగలక్ష్మి, ఎం.సత్యనారాయణ, యు.సత్యనారాయణ రాజు, జి.వెంకటరమణ, ఎం.కాశీ విశ్వనాథరాజు, బి రాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఎల్‌ఎ మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేయాలన్నారు. ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

గోకరాజు శివబాబు సేవలు అభినందనీయం
డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు


ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నూతన భవన నిర్మాణానికి దాత శివబాబు స్థలం ఇవ్వడంతోపాటు రూ.లక్షల్లో ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం జువ్వలపాలెంలో దాత గోకరాజు శివబాబు ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర భవనాన్ని ఆయన ప్రారంభించారు. వెంకట శివరామరాజు మనమరాలు స్వాతి పేరిట నిర్మించి ఎన్‌టిఆర్ సుజల మంచినీటి వాటర్ ప్లాంట్‌ను కూడా డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. అనంతరం 150 ఏళ్ల వందేమాతర సంస్మరణోత్సవ ర్యాలీ, కేన్సర్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ భారతదేశం మొత్తాన్ని ప్రభావితం చేస్తూ ఏకం చేసిన గేయం వందేమాతరం అని, దీనిని రచించిన బంకిం చంద్ర ఛటర్జీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు ఆరేటి వెంకట రత్నప్రసాద్, ఎంపిడిఒ జి. స్వాతి, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి డి.సునీల్‌రాజు, నాయకులు మంతెన పెద నరసింహారాజు, కంతేటి శ్రీనివాసరాజు, నడింపల్లి విశ్వనాథరాజు, తోట ఫణి, జివి.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సర్పంచి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోడూరు:గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని మట్టపర్రు గ్రామ సర్పంచి దొమ్మేటి శ్రీనివాస్ అన్నారు. గ్రామ శివారు పెదపాలెంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచి శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామంలోని యుపి స్కూల్ సెంటర్ నుంచి పెదపాలెం కనకదుర్గమ్మ ఆలయం వైపునకు పంచాయతీ నిధులు దాదాపు రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మించడంతోపాటు కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించిన సందర్భంగా గ్రామస్తులు సర్పంచి శ్రీనివాసును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెచ్చెట్టి పాండురంగ, బండి బాలకృష్ణ, తంగెళ్ల విష్ణు, పాలా ఎర్ర శ్రీను, చెల్లబోయిన లక్ష్మీ శ్రీనివాస్, పెచ్చెట్టి ముసలయ్య, కట్టా నాగసాయి, పాలా శ్రీనివాస్, పెచ్చెట్టి దానేశ్వరరావు, పెచ్చెట్టి శివరామయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం వేడుకలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో వందేమాతరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయకుదురు హైస్కూల్ వద్ద నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు వందేమాతరం అక్షర రూపంలో ప్రదర్శన ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని ఆధ్వర్యంలో, వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి చికిలే మంగతాయారు ఆధ్వర్యంలో వందేమాతరం గేయాన్ని ఆలపించి వేడుకలు నిర్వహించారు. వీరవాసరం, అండలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు వందేమాతరం వేడుకలు నిర్వహించారు. జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపిడిఒ వైజయంతి, ప్రధానోపాధ్యాయులు ఎంఎవి.పెద్దిరాజు, కానుకొలను శ్రీనివాసరావు, జుత్తిగ శ్రీనివాస్, కార్యదర్శులు లక్ష్మి, కళ్యాణి, నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర:వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌వి జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం.లింగం శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతర గీతం ఆలపించారు. పలువురు వక్తలు మాట్లాడారు. యువ నాయకులు మారుతీకృష్ణ, భానుప్రసాద్, దత్తాత్రేయ, మణికంఠ, జగదీశ్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం వందేమాతర గేయాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, సెక్రటరీ కెవి.సీతారామరాజు చేతుల మీదుగా బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వందేమాతర గేయాలాపన చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు మాట్లాడారు. కళాశాల సెక్రటరీ కెవి సీతారామరాజు, అడ్మినిస్ట్రేటర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, నందుల సీతారామరావు, ట్రెజరర్ ప్రవీణ్ ఖాను పాల్గొన్నారు.

నరసాపురం : వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం వందేమాతరం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి జి.శ్రీవేద పాల్గొన్నారు. దేశ నాయకుల చిత్రపటాలకు నివాళు లర్పించిన అనంతరం డిఎస్‌పి విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఎస్‌ఐ సిహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు : వందేమాతరం గీతం కేవలం ఒక పాటగా కాకుండా భారతదేశపు చరిత్ర, సాంస్కృతిక వారసత్వంగా నిలిచి, భారతీయుల్లో దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించిందని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి (అటానమస్) చరిత్ర, పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడారు. పొలిటికల్ అధ్యాపకులు సిహెచ్ నాగశ్రీ, ఎన్‌సిసి క్యాడెట్స్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ విద్యానికేతన్ ప్రాంగణం వద్ద వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నిర్వహించారు. సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్ గరిమెళ్ల సుబ్బారావుశాస్త్రిని నిర్వాహకులు సత్కరించారు.

ఆచంట : మహనీయులు బంకించంద్ర ఛటర్జీ అని ఎస్ఐ కె.వెంకటరమణ అన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థులతో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా దేశ నాయకుల చిత్రపటాలకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం వందేమాతరం గీతం రాసి 150 ఏళ్లు అయిన సందర్భంగా కాలేజీ సిబ్బంది విద్యార్థులు వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. ప్రిన్సిపల్ నిర్మలాకుమారి మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల అభివృద్ధికి సహకరించాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలోని ఆక్వా రైతుల అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. న్యూఢిల్లీ నుంచి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఫిషరీస్ జాయింట్ సెక్రటరీ నీతుకుమారి ప్రసాద్ మత్స్య శాఖపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటి బ్రాకిష్ వాటర్ ఆక్వా క్లస్టర్‌గా పశ్చిమగోదావరి జిల్లాను ప్రకటించిందన్నారు. జిల్లాలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆక్వా రైతులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి కలెక్టర్ మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నీతు కుమారి ప్రసాద్‌కు వివరించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్‌ఎల్‌ఎన్.రాజు, ఎడి సిహెచ్.రాంబాబు, ఎఫ్‌డిఒ బి.శరత్, డిపిఎం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తాడేపల్లిగూడెం:శశి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కొమ్ముగూడెంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో సామాజిక దుష్ప్రవర్తనలు, బాల్య వివాహాలు, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం రూరల్ సిఐ బిబి.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, విద్యార్థులకు సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహన, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. వందేమాతరం పాట 150 సంవత్సరాల సంబరాలు గ్రామ సచివాలయంలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు వందేమాతరం గానం చేసి దేశభక్తిని ప్రదర్శించారు. సర్పంచి తాడేపల్లి బేబీ, కార్యదర్శి వాణి, ఉప సర్పంచి అబ్బిన గోపాలకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు. జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలకు కేన్సర్ నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

గణపవరం:ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కె.ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి మాట్లాడుతూ కేన్సర్‌కు భయపడితే భవిష్యత్ అంధకారమన్నారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో తమసిబ్బంది ఇంటింటికి సర్వేచేస్తున్నారని చెప్పారు. 18 సంవత్సరాలు పైబడినవారికి స్క్రీనింగ్ చేస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ ఒ జాలాది విల్సన్ బాబు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ మహ్మద్ నశీరుల్లాకు సత్కారం

ఉండి:యండగండి డెడ్ బాడీ డోర్ డెలివరీ కేసును ఛేదించడంలో చురుకైన పాత్రను పోషించిన ఉండి ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లాకు కేంద్రీయ గృహ మంత్రి దక్షత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి కావడంతో ప్రతి ఒక్కరూ వందేమాతరం గీతాన్ని ఆలపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అత్యంత చాకచక్యంగా యండగండి కేసును ఛేదించిన ఎస్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనోహర్‌కు జేష్ట ఆచార్య జాతీయ స్థాయి అవార్డు

భీమవరం :పెన్నాడ బైట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎబిఎస్‌ఆర్.మనోహర్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. బ్రెయినో విజన్ సంస్థ జాతీయ స్థాయిలో భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రకటించగా అందులో టీచింగ్ ఇన్నోవేషన్, విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంలో కృషి చేసినందుకు ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎబిఎస్‌ఆర్ మనోహర్‌కు జేష్ట ఆచార్య అవార్డు లభించిందని ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ తెలిపారు. మనోహర్‌ను అకాడమిక్ డీన్ కురెళ్ల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ అధ్యాపకులు అభినందించారు.

చేనేత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేయాలి

ఆచంట: మొంథా తుపాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులను ఆచంటలోని 150 చేనేత కార్మిక కుటుంబాలకు అందజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ కనకరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ చేనేతపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి పిసి.జోషి, ఆచంట వీవర్స్ సొసైటీ సభ్యులు చల్లా వీరవెంకట సత్యనారాయణ, వి.మహేశ్వరరావు, వి.కోటిలింగం, ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వేంపాడులో పలు దుకాణాల్లో తనిఖీలు


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శి, సిబ్బంది

కాళ్ల:దుకాణాదారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వేంపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సుంకర వెంకటేష్ సూచించారు. వేంపాడులో పలు దుకాణాల్లో పంచాయతీ గ్రామ కార్యదర్శి, సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను దుకాణాదారులకు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని వేంపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సుంకర వెంకటేష్ హెచ్చరించారు. ఈ ఆదేశాలను అతిక్రమించిన దుకాణాదారులకు రూ.2,500 నుంచి రూ.40,000 వరకూ భారీ జరిమానాతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేంపాడును ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలు, దుకాణాదారులు సహకరించాలని కోరారు.

మానవాళి మనుగడకు సోషలిజం మార్గం

గణపవరం:మానవాళి మనుగడకు సోషలిజం సరైన మార్గమని సిపిఎం మండల కార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి అన్నారు. అక్టోబరు సోషలిజం జయప్రదం అయిన సందర్భంగా శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కేశవరం, జల్లికాకినాడలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా పని అయిపోయిందని అన్నవారికి అమెరికాలో సోషలిస్టు నాయకుడు మాన్దాని నగర మేయర్‌గా ఎన్నిక కావడం చెంప దెబ్బలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.ఓంకారమ్మ, చింతపల్లి పార్వతి, పి.లక్ష్మీ, కోడి పద్మ, చింతపల్లి అంజి, ఎం.విజ్ఞానం మూర్తి, ఎం.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

9న వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తణుకు


ఈ నెల 9న పిఎస్‌ఎస్ కిరణ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా సంకల్పం-2025 వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం జరగనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు బొల్లా సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక షర్మిష్ఠ ఫుడ్స్ హాల్లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ పిఎస్‌ఎస్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా పట్టణంతో పాటు జిల్లా నలుమూలల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. కొన్ని వందల మంది వికలాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృత్రిమ కాళ్లు (ఆర్టిఫిషియల్ లింబ్స్), భోజనాల ఏర్పాట్లు, ఉచిత వైద్య క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఫాదర్ జోస్ పాల్ అను నేను దెందులూరు మండలం, సానిగూడెం గ్రామం, మిషనరీస్ ఆఫ్ కంపాషన్ సంస్థకు చెందిన హోలీ స్పిరిట్ మేజర్ సెమినరీ పాత్రుల శిక్షణాధిపతిగా పనిచేయుచున్నాను. మా సంస్థ యొక్క భూమి పత్రాలు ఇటీవల అనగా ది.06-09-2025వ తేదీన సానిగూడెం నుండి దెందులూరు ద్విచక్ర వాహనంతో వస్తూ ఉండగా జారిపడి పోయినవి. దస్తావేజుల నెం.5398/2004, 5396/2004, 5397/2004, 5401/2004, 5400/2004, ఈ పత్రాలు చాలా ముఖ్యమైనవి. కావున ఈ పత్రాలు ఎవరికైనా దొరికినట్లయితే క్రింది చిరునామాకు లేదా ఫోన్ నెంబర్‌కు తెలియచేయగలరు.

ఫాదర్ జోస్ పాల్, హోలీ స్పిరిట్ మేజర్ సెమినరీ, దెందులూరు మండలం, సానిగూడెం, ఏలూరు జిల్లా. సెల్: 9492054101.

వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలకు నిధులు
ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని


మాట్లాడుతున్న ఎంపిపి, జెడ్‌పిటిసిలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరైనట్లు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొణితివాడ, రాయకుదురు, నందమూరుగరువు, తోకలపూడి గ్రామాల్లో అసంపూర్తి నిర్మాణాలుగా ఉన్న వెల్‌నెస్ సెంటర్‌లను ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నవుడూరు, బాలేపల్లి, చింతలకోటిగరువు, వడ్డిగూడెం గ్రామాల్లో ఒక్కో వెల్‌నెస్ సెంటర్‌కు రూ.36 లక్షలు చొప్పున కేటాయిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తి చేస్తామన్నారు. మత్స్యపురిలో స్పెషల్ గ్రాంటు రూ.55 లక్షలతో వెలనెస్ సెంటర్‌తో పాటు ప్రహరీ కూడా పూర్తి చేసేలా నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పనులన్నీ తక్షణమే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సిందిగా పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, శిరగినీడి గాంధీ పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల

వీరవాసరం:ఈ నెల 8న వీరవాసరం, కొణితివాడ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలుపుదల చేస్తున్నామన్నారు. వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజావేమవరం, నందమూరుగరువు, పెర్కిపాలెం, చింతలకోటి గరువు, వీరవల్లిపాలెం, నడపనవారిపాలెం, కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగుపోలవరం, నేలపోగుల గ్రామాలకు ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు ప్రత్నామయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

తాడేపల్లిగూడెం : విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్ బోర్డ్ పరిధిలోని మున్సిపల్ ఆఫీస్, రైల్వే ఫీడర్లు పాతూరు పరిధిలోని మహాలక్ష్మీనగర్ ఫీడర్‌కు సంబంధించి మెయిన్ రోడ్డు, మసీదు రోడ్డు, గొల్లగూడెం సెంటర్, భూపాల్ నగర్, కమల హాస్పటల్ రోడ్డు, యూనియన్ హాస్పటల్ ఏరియా రైల్వే స్టేషన్ రోడ్డు, టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఏరియా, లూథరన్ చర్చి ఏరియా, మహాలక్ష్మి నగర్, టిటిడి కళ్యాణ మండపం రోడ్డు సత్యవతీ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనునట్లు తెలిపారు.

నరసాపురం : నరసాపురంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ మధుకుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందన్నారు. తూర్పుతాళ్ళు, ఎల్‌బి.చర్ల, పిఎం.లంక, వేములదీవి, చామకూరి పాలెం, బియ్యపుతిప్ప, కొండవీటి కొడప, కాపుల కొడప తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, శివరావుపేట, డోర్‌నెం.2-2-1, కాపురస్తులు బెల్లంకొండ ఫణికుమార్, S/o.బెల్లంకొండ శ్రీరాములు అను నాయొక్క ఒరిజినల్ నెం.4164/1998 గల దస్తావేజును ది.24-10-2025 తేదీన మా ఇంటి వద్ద నుండి భీమవరం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న జిరాక్స్ సెంటర్‌కి దస్తావేజులు జిరాక్స్ తీయించుకొను నిమిత్తం ఒక కవరులో పెట్టుకొని నా యొక్క మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో 4164/1998 నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. ఎంతవెతికినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుక్కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

బెల్లంకొండ ఫణికుమార్, S/o.శ్రీరాములు
డోర్‌నెం.2-2-1, శివరావుపేట, భీమవరం,
ప.గో.జిల్లా. సెల్: 9440110578

తెలుగు సంఘాల ముఖ్య సమన్వయ కర్తగా రమావతి

తాడేపల్లిగూడెం:ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించి, తెలుగు సంఘాల ముఖ్య సమన్వయకర్తగా కొల్లి రమావతి నియమితులయ్యారు. గజల్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఆంధ్ర సారస్వత పరిషత్ జనవరి మూడో తేదీ నుంచి ఈ మహాసభలను నిర్వహించనుంది. తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధి, లక్ష్యంగా 3 రోజులపాటు వీటిని గుంటూరులోని సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణం (హైవే) లోని నందమూరి తారకరామారావు వేదికపై నిర్వహిస్తారు.

ఐవిఎఫ్ మహిళా విభాగ సలహాదారులుగా కనకరత్నమాల

ఆచంట: భీమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కనకరత్నమాల ఐవిఎఫ్ మహిళా విభాగ సలహాదారులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీను వాసు గుప్తా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నాగ సుప్రజ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

SUMMONS UNDER ORDER V RULE 20 CPC
IN THE COURT OF I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
O.S.No.455 of 2023

Between:
Kadimi Nageswararao ... Plaintiff
And
Kadimi Vasanth Kumar and Others ... Defendants

To.
Defendant No.2
Kadimi Benerji Kumar, S/o.Ganesh,
R/o.D.No.9-18, Satyanarayana Spinning Mills Road, Venkatarayapuram,
Tanuku Mandal-534 215, Tanuku JCJC.

Where as the Plaintiff has instituted a suit against you for permanent injunction. You are here by summoned to appear in this Court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions, on the 25th Day of November, 2025 at 10 'O' Clock to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the suit be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell: 8341437279.
Tanuku
07-11-2025

NOTICE
IN THE COURT OF I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
I.A.No.1581 of 2023 in O.S.No.455 of 2023

Between:
Kadimi Nageswararao ...Petitioner/Plaintiff
And
Kadimi Vasanth Kumar and Others ...Respondents/Defendants

To.
Respondent No.2/Defendant No.2
Kadimi Benerji Kumar, S/o.Ganesh,
R/o.D.No.9-18, Satyanarayana Spinning Mills Road, Venkatarayapuram,
Tanuku Mandal-534 215, Tanuku JCJC.

Where as the above named Petitioner filed a petition for temporary injunction. You are here by given notice to appear in this Court in person or by a pleader duly instructed, to answer all such questions or raise any objections if you got, on the 25th Day of November, 2025 at 10 'O' Clock to answer the Court. Take notice that, in default of your appearance on the day before mentioned, the petition be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell: 8341437279.
Tanuku
07-11-2025

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.5/2021 in O.S.No.180/2006

Between:
1.కర్రి వరలక్ష్మి (డైడ్)
2.సత్తి రజని ప్రసన్న
3.కర్రి వాసంతి
4.కర్రి భారత్ సంతోష్‌రెడ్డి
...పిటీషనర్లు/డిక్రీ హోల్డర్స్
And
1.గొల్లమందల కవలమ్మ
2.గొల్లమందల కుమార రత్నం
3.గొల్లమందల రాజారత్నం
4.చెల్లం రాజ్యలక్ష్మి
5.చింత మేరీ ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్స్
To.
1.గొల్లమందల కవలమ్మ, భర్త ఏసురత్నం, వయస్సు 75 సం॥లు, స్త్రీ, గృహిణి, పూలపల్లి, పాలకొల్లు మండలం.
2.గొల్లమందల కుమారరత్నం, తండ్రి ఏసురత్నం, వయస్సు 53 సం॥లు, పురుషుడు, వ్యాపారం, పూలపల్లి, పాలకొల్లు మండలం.
3.గొల్లమందల రాజారత్నం, తండ్రి ఏసురత్నం, వయస్సు 38 సం॥లు, పురుషుడు, వ్యాపారం, పూలపల్లి, పాలకొల్లు మండలం.
4.చెల్లం రాజ్యలక్ష్మి, భర్త సూర్యారావు, వయస్సు 45 సం॥లు, స్త్రీ, గృహిణి, కవిటం, పోడూరు మండలం.
5.చింత మేరీ, భర్త సుధాకరరావు, వయస్సు 43 సం॥లు, స్త్రీ, గృహిణి, పూలపల్లి, పాలకొల్లు మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెటర్స్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ది.24-11-2025వ తేదీన ఉ.గం. 10.30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల పాలకొల్లు మండలం, పూలపల్లి గ్రామ పంచాయతి పరిధిలో గల రి.స.నం. 233/2, L.P.No.596/1985 and revised L.P.No.638/1985 దాఖలా ప్లాట్ నెం.13లో గల 311-1-0 చ॥గ॥ స్థలం, దానిలో గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు గల డోర్ నెంబర్.1-149 గా గల మేడ భవంతికి హద్దులు :
తూర్పు : చెరుకూరి రామరాజు వగైరాల స్థలం
పడమర: రోడ్డు
దక్షిణం : గొట్టుముక్కల సాయి రామవతి గారి స్థలం.
ఉత్తరం : ప్లాట్ నం.12 ఇంటి స్థలం.
యావత్తు ఈజిమెంటు హక్కులు, విద్యుత్ కనక్షన్‌తో సహా..
డిక్రీ హోల్డర్ విలువ : Rs.4,09,500/-
అమినా విలువ : Rs.5,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
న్యాయవాది, పాలకొల్లు
పశ్చిమ గోదావరి జిల్లా.
పాలకొల్లు
తేది.06-11-2025